క్లుప్తంగా

మానవత్వం చాటిన సర్పంచ్



ప్రాథమిక చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బందితో సర్పంచ్ జ్యోతిబ్రహ్మం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో బుధవారం కొరడాతో శరీరంపై కొట్టుకుంటూ భిక్షాటన చేస్తున్న గంపలగూడెం మండలం లింగాల గ్రామానికి చెందిన పొట్టియ్య ఉన్నట్లుండి ఒక్కసారిగా లో బీపీ వచ్చి కాలు, చెయ్యి పడిపోయి కుప్పకూలాడు. అటుగా వెళ్తున్న గ్రామ సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం స్పందించి వెంటనే వైద్య సిబ్బందిని తీసుకొచ్చి ప్రాథమిక చికిత్స అందించారు. పొట్టియ్య కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేసి 108 వాహనంలో నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా పొట్టియ్య కుటుంబసభ్యులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీమా సొమ్ము రూ.లక్ష అందజేత

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామానికి చెందిన పరిటాల ఏడుకొండలు మరణించటంతో బుధవారం స్థానిక సచివాలయంలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.లక్ష నగదును ఏడుకొండలు భార్య త్రివేణికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హలీమ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

జుజ్జూరు(వీరులపాడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, ఎంపీటీసీ సభ్యురాలు తమ్మిశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆయుర్వేద కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గురుమూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆయుర్వేద దినచర్యను పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలని రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గురుమూర్తి అన్నారు. బందరు లాకుల వద్ద గల నోరి రామ శాస్త్రి ఆయుర్వేద కళాశాల డైమండ్ జూబ్లీ హాల్లో విశ్వ ఆయుర్వేద పరిషత్ విజయవాడ విభాగ్ ఆధ్వర్యంలో విశ్వ మంగళ దివస్ బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వ ఆయుర్వేద పరిషత్ నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదం అభివృద్ధికి సమయం ఆసన్నమైందన్నారు. వైద్యులు, వైద్య విద్యార్థులు మరింతగా కృషి చేసి ఆయుర్వేదాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఆయుర్వేద వైద్యులు సూచించిన ఆహార నియమాలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. విశ్వమంతా ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో విశ్వ మంగళ దివస్ నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ గురుమూర్తిని సత్కరించారు. ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ సాయి సుధాకర్, ఆర్‌డీడీ వెంకట కృష్ణ, సూపరింటెండెంట్ రాజరాజేశ్వరి, విశ్వ ఆయుర్వేద పరిషత్ విజయవాడ అధ్యక్షురాలు డాక్టర్ పూర్ణ రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లు ధరణికుమార్, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అండర్-9 చెస్ పోటీలకు కానూరులోని స్కాట్స్‌పైన్ స్కూల్ విద్యార్థులు యు.రిత్విక్, యు.దివ్యాన్ష్, తేజవజ్రాక్ ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా పోటీల్లో ముగ్గురు క్రీడాకారులు అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. అనంతరం జరిగిన జిల్లా జట్ల ఎంపిక పోటీల్లోనూ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారు. త్వరలో గుడివాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారులను, కోచ్ జి.రామకృష్ణను స్కాట్స్‌పైన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.ప్రతిమ అభినందించారు. ఈ ముగ్గురు క్రీడాకారులు గత కొన్నేళ్లుగా విజయవాడలోని ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్నారన్నారు. రాష్ట్ర స్థాయిలోనూ పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని కోరారు.

పన్ను వసూళ్లు మందగమనం

- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా వసూలు కాని పన్నులు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న పంచాయతీ సిబ్బంది



కంచికచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

కంచికచర్ల: ఆర్థిక సంవత్సరం మరో నెలరోజుల్లో ముగియనుంది. అయినా ఇంటి పన్నుల వసూళ్లలో అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా గ్రామ పంచాయతీల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇంటి పన్నుల వసూళ్లలో మండలంలోని పరిటాల మేజర్ గ్రామ పంచాయతీ మాత్రం కొంచెం మెరుగ్గా ఉందని అధికారులంటున్నారు. పెండ్యాల, కంచికచర్ల ఇంటి పన్నుల వసూళ్లలో చాలా వెనుకబడి ఉన్నాయని సమాచారం. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో ఐదు గ్రామాలు మాత్రం వంద శాతం ఇంటి పన్నులు వసూలయ్యాయని అధికారులు తెలియజేశారు. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మార్చి నెలాఖరు నాటికి 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉన్నా కేవలం చిన్న గ్రామ పంచాయతీలు ఐదు మాత్రమే 100 శాతం వసూలు చేశాయని ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు.

గ్రామ పంచాయతీ	వసూలు కావల్సిన పన్ను	వసూలయిన పన్ను	శాతం
1. బత్తినపాడు	రూ. 59,045	రూ.59.045	100 శాతం
2. చెవిటికల్లు	రూ. 5,68339	రూ.4,73528	83.32 శాతం
3. గండేపల్లి	రూ. 10,88,885	రూ.10,84,758	99.62 శాతం
4. గనిఆత్కూరు	రూ.8,84,911	రూ.7,77657	87.88 శాతం
5. గొట్టుముక్కల	రూ. 8, 28,928	రూ. 8,24453	99.46 శాతం
6. కంచికచర్ల	రూ. 2,56,16,164	రూ.1,27,93,411	49.94 శాతం
7. కీసర	రూ.8,13,564	రూ. 7,42,900	91.33 శాతం
8. కొత్తపేట	రూ. 2,81,953	రూ. 2,77,327	98.36 శాతం
9. కునికెనపాడు	రూ. 1,33,092	రూ. 1,33,092	100 శాతం
10. మోగులూరు	రూ.6,28,922	రూ.5,66,367	81,11 శాతం
11. మున్నలూరు	రూ.1,79,900	రూ.1,79,900	100 శాతం
12. పరిటాల	రూ. 29,79,865	రూ. 22,20,003	74.50 శాతం
13. పెండ్యాల	రూ. 12,78,358	రూ. 94,229	7.37 శాతం
14. పేరకలపాడు	రూ. 1,69,736	రూ. 1,69,736	100 శాతం
15. ఎస్.అమరవరం	రూ. 70,866	రూ. 70,866	100 శాతం
16. వేములపల్లి	రూ. 3,07,730	రూ. 2,83,726	92.20 శాతం

వంద శాతం వసూలు చేస్తాం

కంచికచర్ల మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేసేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు 57.71 శాతం మాత్రమే వసూలయ్యాయి. జిల్లా కలెక్టర్, డీపీఓ ఆదేశాల మేరకు ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాం. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసుకుని పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం.

పి.శ్రీనివాసరావు,
ఈఓపీఆర్డీ, కంచికచర్ల

పండుగలా పింఛన్ల పంపిణీ



నందిగామలో మంచం మీద ఉన్న వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ ధనమూర్తి



వత్సవాయిలో రెండేళ్లుగా మంచంపై ఉంటున్న సీతారామమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ భవిత

నందిగామ: డివిజన్ పరిధిలోని నందిగామ, జగ్గయ్యపేట మునిసిపాలిటీలతో పాటు అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో బుధవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జోరుగా సాగింది. దాదాపు ప్రతి గ్రామంలో తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. నందిగామ డివిజన్ పరిధిలో మొదటి రోజే సాయంత్రం 6 గంటల సమయానికి 78.28 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. నందిగామ నగర పంచాయతీ పరిధిలో 88.4 శాతం, జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో 79.7 శాతం పింఛన్లను పంపిణీ చేయగా, నందిగామ మండలంలో 76.65 శాతం, జగ్గయ్యపేట మండలంలో 74.1శాతం, కంచికచర్ల మండలంలో 85 శాతం, వీరులపాడు మండలంలో 76.99శాతం, చందర్లపాడు మండలంలో 74.25 శాతం, పెనుగంచిప్రోలు మండలంలో 79.8శాతం, వత్సవాయి మండలంలో 70.41 శాతం పింఛన్లను మొదటి రోజే పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలోనూ అధికారుల పర్యవేక్షణలో పింఛన్ పంపిణీ కార్యక్రమం కొనసాగింది. మొత్తం మీద ప్రభుత్వ కృషి, వలంటీర్ల సేవాభావంతో పింఛన్ల పంపిణీ నిరాటంకంగా జరిగింది.

పెనుగంచిప్రోలులో 80 శాతం పింఛన్ల పంపిణీ

పెనుగంచిప్రోలు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ ఈనెల మొదటి రోజు బుధవారం 80 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ తెలిపారు. వలంటీర్లు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. వెంకటాపురం గ్రామంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ సర్పంచ్ కూచి నర్సయ్యతో కలిసి నూతన పింఛన్లు పంపిణీ చేశారు. మండల కేంద్రం పెనుగంచిప్రోలులో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, అనిగండ్లపాడు గ్రామంలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

వత్సవాయిలో 6685 మందికి...

వత్సవాయి: మండలంలో మొత్తం 9494 పింఛను లబ్ధిదారులు ఉండగా బుధవారం 6685 మందికి పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ తెలిపారు. వలంటీర్లు వారి పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు ఉదయమే వెళ్లి పింఛన్లు అందజేశారన్నారు. నడవలేక మంచంపై ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు నేరుగా వారి చెంతకు వెళ్లి పింఛను అందిస్తున్నందుకు వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కంచికచర్లలో 87.23 శాతం

కంచికచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 10,227 పింఛన్‌దారులు ఉండగా తొలిరోజు 8,922 మంది లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేసినట్టు ఎంపీడీఓ కె.బాల శంకరరావు తెలిపారు. మొత్తం మీద 87.23 శాతం పింఛన్‌లు అందజేశామని చెప్పారు.

తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన



సిలువ గిరి తిరునాళ్ల ఏర్పాట్లపై నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌ఓ సతీష్

నందిగామ: ప్రశాంత వాతావరణంలో సిలువ గిరి తిరునాళ్ల మహోత్సవాలు జరుపుకొనేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓ సతీష్ సూచించారు. పట్టణ శివారులోని సిలువ గిరి పుణ్యక్షేత్ర తిరునాళ్ల మహోత్సవాలు ఈనెల 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తిరునాళ్ల ఏర్పాట్లను బుధవారం ఎస్‌హెచ్‌ఓ సతీష్ పరిశీలించారు. సిలువ గిరి విచారణ గురువు ఎం.ఫిలోమెన్‌రాజు, సంఘ పెద్దలతో సమీక్ష నిర్వహించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అవసరమైన చోట ఏర్పాటు చేయవలసిన బందోబస్తుపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వేల్పుల రాము, ఎస్‌ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుల కల్యాణం



నందిగామ: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో 70వ రామకోటి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మూడవ రోజైన బుధవారం ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పద్మావతి శ్రీనివాసుల దివ్య కల్యాణం వైఖానస సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కల్లాల్లో మిర్చి అపహరణ

పెనుగంచిప్రోలు: మిర్చి ధర అధికంగా ఉండటంతో కొందరు మిర్చి చోరీలకు పాల్పడుతున్నారు. తాజాగా మండలంలోని లింగగూడెం రోడ్డులో పెనుగంచిప్రోలుకు చెందిన రైతు కర్ల శ్రీహరి కల్లంలో మంగళవారం రాత్రి గ్రేడ్ చేసి ఆరబోసిన మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సుమారు 10 క్వింటాళ్లకు పైగా మిర్చిని తీసుకెళ్లినట్లు రైతు శ్రీహరి వాపోయారు. దీనిపై బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు.

వాడి వేడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు, వేదికపై ఎంపీపీ సుందరమ్మ, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీ

నందిగామ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడి వేడిగా జరిగింది. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలుతో పాటు పలు స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు. మండల పరిషత్ అధ్యక్షురాలు అరిగెల సుందరమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఆకుల రంగా, అన్నే పిచ్చయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ నరసింహారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జుజ్జూరు ప్రజల హర్షాతిరేకాలు

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న జుజ్జూరు మండల సాధన అభివృద్ధి అడ్‌హక్ కమిటీ సభ్యులు

జుజ్జూరు(వీరులపాడు): జుజ్జూరును మండల కేంద్రంగా మారుస్తూ సాహసోపేత నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మండల ప్రజలు రుణపడి ఉంటారని జుజ్జూరు మండల సాధన అభివృద్ధి అడ్‌హక్ కమిటీ సభ్యులు అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో జుజ్జూరు మండల కేంద్రంగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ మండల కేంద్ర మార్పుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా సంతకాల సేకరణ చేయటంతో పాటు జుజ్జూరును మండల కేంద్రంగా త్వరితగతిన పాలన సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉన్నతాధికారులకు పోస్టుకార్డులు పంపారు. మండల కేంద్ర మార్పునకు కృషి చేసిన శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమావత్ కోటి, పసుపులేటి సాయిబాబు, పూలా రాంబాబు, మేడికొండూరు రవికుమార్, జిల్లేపల్లి స్వామి, షహనాజ్ బేగం, నాగుల్‌మీరా, పలువురు కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొంగలి షెడ్డులో ఇబ్బందులు లేకుండా చూడాలి



గ్యాస్ పొయ్యి వెలిగించి చూస్తున్న చైర్మన్ రాంబాబు, పాలక మండలి సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పొంగలి నైవేద్యం వండే షెడ్డులో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఘాట్‌రోడ్డు ఓం టర్నింగ్‌లోని పొంగలి షెడ్డును చైర్మన్, పాలక మండలి సభ్యులు బుధవారం పరిశీలించారు. పొంగలి నైవేద్యం వండేందుకు దేవస్థానం 20 గ్యాస్ పొయ్యిలను సిద్ధం చేయడంతో వాటిని వెలిగించారు. పొంగలి షెడ్డు లోపల వేడి బయటకు వెళ్లేలా ఎగ్జాస్ట్ ఫ్యాన్‌లను ఏర్పాటు చేయాలని, షెడ్డు లోపల మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయాలని సూచించారు. షెడ్డుకు అవసరమైన మరమ్మతులు చేపట్టి వీలైనంత త్వరగా పొంగలి షెడ్డును ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు.

ఇళ్ల మంజూరుకు ఎమ్మెల్యే తక్షణ ఆదేశం



పరిటాలలో ముస్లిం మహిళకు ఇల్లు మంజూరు చేయాలని ఆదేశిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

"అయ్యా ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వంలో కూడా ఇల్లు ఇవ్వలేదు....ఒకే ఇంటిలో మూడు కుటుంబాల వాళ్లం ఉంటున్నాం ....మాకు ఇల్లు మంజూరు చేయండి సారూ..." అంటూ ఓ ముస్లిం మహిళ షేక్ మైనూర్‌బీ ఎమ్మెల్యేకి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు గ్రామ సచివాలయంలో పనిచేసే గృహనిర్మాణశాఖ ఉద్యోగిని పిలిపించి ఆమెకు, ఆమె కుటుంబీకులకు రెండు ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో ఆ మహిళ ఆనందానికి అవధులు లేవు. మండలంలోని పరిటాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ఘటన జరిగింది.

కంచికచర్ల: పరిటాల గ్రామంలో ఎమ్మెల్యే బుధవారం ఉదయం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, వెంటనే పరిష్కరించాలని మహిళలు కోరగా, ఈ విషయంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలోని ప్రజలందరికీ తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, గ్రామ గృహసారథుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు మార్త శ్రీనివాసరావు, కర్ల రామకృష్ణ, జమలయ్య, జాన్‌బాబు, ఏసుబాబు, యద్దనపూడి విజయారావు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కచ్చితమైన కొలతలు, హద్దులతో రీసర్వే

తహసీల్దార్ రాజకుమారి



పరిటాలలో సరిహద్దు రాళ్లను దగ్గరుండి పాతిస్తున్న తహసీల్దార్ రాజకుమారి

కంచికచర్ల: కచ్చితమైన కొలతలు, హద్దులతో భూములను రీ సర్వే చేసి సర్వే హద్దు రాళ్లను పాతుతున్నామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి అన్నారు. మండలంలోని పరిటాలలో బుధవారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వ, ప్రయివేటు భూములను రీ సర్వే చేసి రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఆ భూములకు ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. ఈ నెల 15వ తేదీ లోగా సరిహద్దు రాళ్లను పాతేలా తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు, కౌలురైతులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ ఆఫ్ సర్వేయర్ నంద్రు అనూష్‌కుమార్, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్ధన్, రైతులు పాల్గొన్నారు.

చైల్డ్ ఫ్రెండ్లీ విలేజీలుగా తయారు చేయాలి

కంచికచర్ల: ప్రతి బాలిక, బాలుడి హక్కులు కాపాడటమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యదశలోనే సంపూర్ణ జీవితంతో జీవించాలన్నారు. భాష, విద్య, విలువలు, ప్రవర్తన మొదలైనవి 18 ఏళ్ల లోపు నేర్చుకోవాలన్నారు. బాల్యం అంటే నేర్చుకునే దశ అని, మనకు అన్ని అవసరాలు అందుబాటులో ఉంటేనే పరిపూర్ణంగా విషయ పరిజ్ఞానం తెలుసుకుంటామని అన్నారు. గ్రామాలను చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్‌లుగా తయారు చేయాలన్నారు. ఎంపీడీఓ కె.బాల శంకరరావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాణ్యమైన విద్యను అందిపుచ్చుకోవాలని, అప్పుడే పెద్దయ్యాక మంచి జీతం, జీవితం పొందగలుగుతామని అన్నారు. సమావేశంలో ఎంఈఓ ఎల్.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు జగనన్న భరోసా

రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్‌కే రోజా



మంత్రి రోజాను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, ఫౌండేషన్ చైర్‌పర్సన్ విమలాభాను

జగ్గయ్యపేట: రాష్ట్రంలో మహిళల భద్రతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారని రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందించేందుకు జగ్గయ్యపేట వచ్చిన ఆమెను స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గృహంలో బుధవారం రాత్రి విమలాభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ జగనన్న పాలనలో మహిళలు మహారాణులుగా రాణిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మహిళల పక్షపాతిగా ఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, పారిశ్రామికంగా ఎదుగుతుండటంతో పాటు ఎన్నో విజయాలు సాధిస్తున్నారన్నారు. మహిళలు ఎప్పుడూ జగనన్నకు తోడుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు సంపత విజిత, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, కో-ఆప్షన్ సభ్యురాలు బహీర్‌మున్నీసా, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మునిహేరా, మహిళా కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

ప్రసాద్ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

జగ్గయ్యపేట అర్బన్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సోదరుడు దివంగత సామినేని వెంకట మల్లికార్జున ప్రసాద్ 43 వ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మిత్ర మండలి ఆధ్వర్యంలో పలు ప్రాంతాలలోని నిరుపేదలకు అన్నదానాలు, పలు చోట్ల భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు చారుగుండ్ల కొండ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలోని బాలింతలు, రోగులకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. చెరువు బజారు, ఆనందసాయి ఆలయం వద్ద, ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ప్రసాద్ మిత్రమండలి సభ్యులు కఠారి హరిబాబు, అంజనీ ప్రసాద్, ఆకుల బాజీ, షేక్ ఖాజా, ఆవాల భవానీ, టీఎస్ బ్రహ్మం పాల్గొన్నారు.

ఎల్బీఆర్సీఈకి సిస్కో అకాడమీ అవార్డు



అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అప్పారావు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు సిస్కో అకాడమీ అవార్డు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. మైలవరం కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బెంగళూరులో ఇటీవల జరిగిన 25వ సిస్కో అకాడమీ వార్షికోత్సవాల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు సిస్కో నెట్‌వర్కింగ్ బెస్ట్ అకాడమీ అవార్డు అందజేశారన్నారు. ఈ అవార్డుకు కృషి చేసిన అధ్యాపకులు కె.ఫణీంద్ర, ఎన్. శ్రీకాంత్‌ను కళాశాల యాజమాన్యం, అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, డాక్టరేట్స్, ప్రిన్సిపాల్ అప్పారావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ శ్రీనివాసరావు, సీఎస్ఈ విభాగాధిపతి వీరయ్య, ఐటీ విభాగాధిపతి శ్రీనివాసరావు, కళాశాల స్పోక్స్‌పర్సన్ నాగాంజనేయులు అభినందించారు.